




**తెల్ల తెల్ల వారకుండానే ఎమ్.ఎల్.ఎ. గారికి ఆసుపత్రి నుంచి వార్త వచ్చింది. దేముడు చచ్చిపోయాడని, అతని కోసం ఎవ్వరూ రాలేదని.**

**ఎమ్.**ఎల్.ఎ. గారు తన సేనానాయకుడికి ఆజ్ఞ ఇచ్చాడు. "మన మనుష్యులని తీసుకుని ఆ ఇంటికి కాపలా కాయండి. నేను వచ్చే దాకా ఎవ్వరినీ ఇంట్లోకి వెళ్లనివ్వవద్దు!"

సైనికులు సాయుధంగా ఆ ఇంటికి తరలి పోయారు. "నిన్న ఉదయం ఆరోగ్యంగా సంతోషంగా కనపడిన వ్యక్తికి ఇంతలో ఏమి ముంచుకు వచ్చింది?" ఇది పరిష్కారం లేని సమస్య.

ఆ ఊరు, పేరు ఎందుకు లెండి! రామరాజ్యానికి అనేక ఆమడల దూరంగా, రావణాసురుడి నగరానికి - అదే రాజ్యానికి - చేరువగా ఉన్న 'నగర గ్రామం' పట్టణంలో ఉండే హెచ్చు ధరలు - పవర్ కట్లు, నీటి కొరతలు ఉన్నాయి. పల్లెలలో ఉండే ఇబ్బందులు ఉన్నాయి.

ఈ పట్టణానికి, ఏ ఊరి వాడో, ఎవ్వరి వాడో తెలియదు కాని పాతిక సంవత్సరాల వెనుక ఒక రోజు సాయంకాలం అసుర సంధ్యవేళలో దేముడల్లె, గంజాయి వనంలో




తులసి మొక్కలాగా ఆయన లారీలో సామానులు పెట్టుకుని మా ఊరు వచ్చాడు. కారు రచ్చబండ దగ్గర ఆగింది.

"సీతారామయ్యగారి ఇల్లు ఎక్కడ?' అని అడిగాడు.

"ఎందుకు?" అని వాళ్లు ఎదురు ప్రశ్న వేశారు.

"ఆ ఇల్లు నేను అద్దెకు తీసుకున్నాను. ఇంటి తాళాలు తీసుకుని వచ్చాను."

"మీ ఆడంగులు, పిల్లలు ఏరి?" అని ఊరి పెద్ద అడిగాడు.

ఆయన ఒక్క క్షణం ఏమీ మాట్లాడలేదు. "ఇల్లు ఎక్కడ ఉందో చూపిస్తారా?'' అని అడిగాడు.

చాయి దుకాణంలో పనిచేసే కుర్రవాడు దోవ చూపించగా ఆయన ఆ ఇంటికి వెళ్లి దాంట్లో స్థిరపడ్డాడు.

మావాళ్లు ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఆయన గురించిన వివరాలు తెలుసుకుందామని. కాని చుక్క ఎదురైంది.

దోపిడీలు, హత్యలు, మానభంగాలు - స్కాంలు, హవాలా వంటి విషయాలలో నిష్ణాతులైన వ్యక్తులు ఉన్న ఈ నగరంలో ఈ పరాయి వ్యక్తి - మాట మంచితనంతో వినయంతో దానంతో, ధర్మంతో అందరినీ ఆకట్టుకున్నాడు.

శీతాకాలంలో, పార్వతీ పరమేశ్వరుల వంటి వృద్ధ పేద దంపతులకి ఒక రాత్రి నీడ ఇచ్చి ఆదరించి, మంచి బట్టలు, చలిని తట్టుకునే రెండు ఉన్ని కంబళ్లు ఇచ్చి వారికి దారి భత్యం ఇచ్చి పంపించాడు.

ఆ ఇల్లాలు ఇతనిని మనసార దీవించి "నువ్వు దేముడువి" అని అంది. ఎవ్వరూ చెప్పకపోయినా ఈ వార్త ఆనోటా ఈనోటా పాకి ఊరందరికి-మధ్యాహ్నం సూర్యుడు నడినెత్తికి వచ్చేసరికి అందరికి తెలిసింది. కాలక్రమేణా విషయం మరుగున పడినా ఆ పేరు మాత్రం నిలిచింది.

ఆ పేరు నిలవడానికి ఇంకొక ముఖ్య కారణం ఉంది. పగలు సెగలతో నిత్యం రగులుతూ, శత్రువులు తప్ప మిత్రులు లేని ఆ నాగరీకులకి ఈ అజాత శత్రువు అందరికి తలలో నాలుక అయ్యాడు. ఆత్మీయుడయ్యాడు. ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా, ఆయన వారిని ఆదుకోవలసిందే. కంటికి రెప్పలాగా కాపాడ వలసిందే.

ఎవరి ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మామిడి తోరణం కట్టిన క్షణం నుంచి అంపకాల దాకా ఆయన చేదోడు వాదోడుగా ఉంటూ కంచి గరుడ సేవ చేయవలసిందే.

తన పబ్బం గడుపుకొనడానికి ఆయన ఊరి వారి మీద పడి మేస్తున్నాడేమోనని అనుకుంటే, అలా అనుకుని చాల మంది పొరబడ్డారు. ఎందుకంటే ఆయన ఎవ్వరి ఇంట్లో భోజనం చేసేవాడు కాదు. ఆ క్షణానికి మాయమయ్యేవాడు. తన ఇంట్లో కూడా వంట ఏర్పాటు లేదు. ఉదయం ఇడ్లీ, మధ్యాహ్నం పండ్లు, పెరుగు, సాయంకాలం రెండు చపాతీలు, వేడి వేడి పాలు. నాయర్ టీ సెంటరులో రెండు మూడు సార్లు టీ తాగేవాడు.

సంవత్సరంలో తొమ్మిది నెలలు ఇంటిపట్టున ఉండేవాడు. మూడు నెలలు తీర్థయాత్రలకు, ఎక్కువగా కాశీ ప్రాంతాలకు వెడుతూ ఉండేవాడు.

ఆయన తిరిగి వచ్చే రోజుకోసం అందరూ వెయ్యి కళ్లతో ఎదురు చూస్తూ ఉండేవాళ్లు. ఆయన కోసం కంటే కూడా ఆయన తెచ్చే వస్తువుల కోసం ఎదురు చూసేవారు.

ఆయన పేరు పేరునా మనుష్యులని గుర్తు పెట్టుకుని వాళ్లకి ఏదో ఒక వస్తువు కానుకగా తెచ్చి పెట్టేవాడు. ఆ ఊరిలో చాలామంది మగవారికి రుద్రాక్షమాలలు, చిత్రాసనాలు ధావళీలు, కాశిపట్టు పంచెలు తెస్తే సువాసినులకు బనారస్ పట్టు రెవికల గుట్టలు తీసుకు వచ్చేవాడు. ఇంటింటా ఉన్న గంగ చెంబులన్నీ ఆయన యాత్రా ఫలితమే. విశేషం ఏమిటంటే ఆయన ఎవరికి అవసరమో ఎవరికి ఏ వస్తువు నప్పుతుందో ఆ వస్తువు తీసుకు వచ్చేవాడు.

ఆడపెళ్లివారు అంటే ఆయనకు చాలా ఇష్టం. కన్యాదానం చేసే దంపతులకు, ఆ పెండ్లి కూతురికి మంచి బట్టలు పెట్టేవాడు. ఎవరి ఇంట్లో శుభకార్యం జరిగినా ఆయన ఏదో ఒక కానుక ఇస్తారని అందరికీ తెలుసు. అందరూ వాటికోసం ఎదురు చూసేవారు.

మన అందరికీ ఇంత చేస్తున్నాడు కదా... మనం కూడా ఆయనకు ఏదైనా ఇద్దామనే ఆలోచన ఇంకొక చోట అయితే ఉండేదేమో కాని, మాకు అటువంటి ఆలోచనలు పొరపాటున కలలోకి కూడా వచ్చేవి కాదు.

ఇన్ని మంచి గుణాలున్నా ఆయనలో చంద్రుడిలో మచ్చలాగా ఒక పెద్ద లోపం ఉంది.

ఎవరికీ ఎట్టి పరిస్థితులలో అప్పు ఇచ్చేవాడు కాదు. పరాయివాడు, పిల్లాజల్లా లేనివాడు, ఎగగొట్టినా వసూలు చేసుకోగల స్తోమత లేనివాడు కదా అన్న ఆలోచనతో ఆ ఊరిలోని పెద్దలు ప్రయత్నం చేశారు.

ఆయన చిరునవ్వు నవ్వి "మీకు అప్పులు ఇవ్వగలిగినంత వాడిని కాదు" అని సమాధానం చెప్పాడు.

"వ్యాపారంలో వాటా కలవండి. బోలెడంత లాభాలు వస్తా"యని అని ఎరవేశారు.

"సంసారం లేని వాడిని. ఎవరికోసం ఈ లంపటాలు'' అని సమాధానం వచ్చేది.

"కూర్చుని తింటే?"

"కొండలు ఉంటే కదా కరగటానికి. నాది ఆ జన్మ పర్యంత ఐశ్వర్యం" అని ఆయన సౌమ్యంగానే సమాధానం చెప్పాడు.

ఇంత కంటె తెలివి కలవారు "మీకు డబ్బు అవసరమైతే మమ్మల్ని అడగండి మీకు ఎంతైనా ఇస్తాము" అని ముందుకు వచ్చారు.

ఆయన వాళ్లకి నమస్కరించి "మీకు అటువంటి అవకాశం కల్పించను. నాకు ఉన్నదాంట్లోనే బతకాలి అనేది నా సిద్ధాంతం" అని సవినయంగా మనవి చేశాడు.

ఈ నాటికీ మాకు ఆయన విషయంలో అర్థంకాని విషయం ఆయన ఇంటి గోడమీద మూడు మాటలు రాయించాడు.

"అవ్యయం! అప్రమేయం! అనంతం!"

ఇది ఏమిటని ఎవరూ అడగలేదు. 'ఇది ఒక రకం పిచ్చి!' అని సరిపెట్టుకున్నారు. యథాప్రకారం పరిగ్రహ యజ్ఞంలో లీనమై పోయారు. నా ఆస్తే కాదు నీ ఆస్తి కూడా నాదే- అనే కార్యక్రమంలో ఉన్నారు. కాని, ఈనాటి ఉదయం అందరికీ తెలిసిన విషయం - నిన్నటి దాకా మన అందరి మధ్య ఉన్న వ్యక్తి అకస్మాత్తుగా మరణించాడని - చాలాకాలంగా తెలిసిన విషయం అతనికి ముందు వెనుక ఎవ్వరూ లేరని -

ఎమ్.ఎల్.ఎ. గారి మనుష్యులు అక్కడి చేరేసరికే మంచి కోలాహలంగా, గందర గోళంగా ఉంది. సుమారు ఊరు ఊరంతా అక్కడే ఉంది.

ఆసుపత్రికి ఎవ్వరూ వెళ్లలేదు. హాస్పిటల్ స్టాఫ్ తప్ప.

గంటన్నర గందరగోళం అయిన తరువాత, సద్దుమణిగిన తరువాత ఆ ఊరి మేధావులకు అర్థమైన విషయం-

ఆ ఇంట్లో దోచుకోవడానికి దొంగిలించడానికి ఒక్క భగవద్గీత కాపీ, ఒక పంచ, రెండు లాల్చీలు, ఒక తుండు గుడ్డ తప్ప ఏమీ లేవని. ఆ క్షణంలోనే అక్కడి వారంతా బోధి వృక్షం కింద బుద్ధులైయ్యారు.

జ్ఞానోదయం అయింది. ఆ క్షణంలోనే అతను ఎవరికీ కానివాడు. ఎవ్వరూ లేనివాడు పరాయి వాడు అయ్యాడు. ఒంటరి వాడుగా వచ్చి ఒంటరి వాడుగానే మిగిలిపోయాడు.

ఈ అనాథకు అంతిమ సంస్కారం ఎవ్వరు చేస్తారని ప్రశ్న ఆసుపత్రి నుంచి వచ్చింది.

అందరూ పట్టు పంచలు తీసుకున్నవారు, రుద్రాక్ష మాలలు వేసుకున్నవారు, చిత్రాసనాల మీద భగవ[illegible]్ ధ్యానం చేసుకున్నవారు, పట్టు రెవికలు కుట్టించుకున్న సువాసినులు, అందరూ కలిసి ఏకగ్రీవంగా ముక్తకంఠంగా చెప్పిన సమాధానం.

"మా కేమీ సంబంధం లేదు" -

ఆయన అంతిమ యాత్ర ప్రారంభమైంది. నలుగురి భుజాల మీద కాదు. మునిసిపల్ బండిలో.

ఆ కట్టెకు స్నానం లేదు. నూతన వస్త్రధారణ లేదు. ముఖాన కుంకుమ బొట్టు లేదు. మెడలో పూలమాల లేదు.

నిర్గుణంగా, నిర్వికారంగా ఉన్నాడు. పెదవులపైన చెరగని చిరునవ్వు.

ఆ బండి వెంట బండి తోలుతున్న డానియల్. సబ్ ఇన్స్‌పెక్టర్ రహమాన్ సాహెబ్ గారు, కానిస్టేబుల్ వెంకటస్వామి ఉన్నారు... ముగ్గురికీ కోపంగా ఉంది. జాలి వేస్తోంది. మనుష్యుల నైజం తలుచుకుని అసహ్యం వేస్తోంది.

ఆ ఊరి వారెవ్వరూ వెంట రాలేదని!!

వీరు స్మశానానికి జేరుకునే సరికి గవర్నమెంటు ఖర్చుతో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఆ వెట్టివాడి దగ్గరగా ఇద్దరు వృద్ధ దంపతులు నిలబడి ఉన్నారు.

పురుషుడు గంభీరంగా ఉన్నాడు. స్త్రీమూర్తి వదనంలో దుఃఖం కనిపిస్తోంది.

ఎవరి సహాయం లేకుండానే ఆ శరీరానికి సకల మర్యాదలు చేశారు. చితి మీద పడుకోపెట్టారు.

తెల్లటి సూర్యుడు, ఎర్రబడుతున్నాడు. నీడలు పొడుగవుతున్నాయి.

వెంట వచ్చిన వారు తలమీద నుంచి టోపీలు తొలగించుకుని వినయంగా గౌరవంగా నిలబడ్డారు.

వెట్టివాడు "అయ్యగారూ! ప్రొద్దు గూకి పోతోంది" అని నెమ్మదిగా అన్నాడు.

ఆవిడ కళ్లవెంబడి నీళ్లు కారుతున్నాయి. "ద్రౌపదిని కాపాడిన కృష్ణ పరమాత్ముడు వెళ్లిపోతున్నా"డని వాపోయింది.

ఆయన ఆ శరీరాన్ని అగ్నికి అప్పచెబుతూ "అమృతంగమయ!" అని అన్నాడు.

వారికి నమస్కరిస్తూ రహమాన్ గారు-

"మీరు ఎవరు?" అని అడిగాడు.

"నా పేరు మహేశం. మా ఆవిడ ఉమాదేవి" అని సమాధానం చెప్పాడు. పొగ దట్టంగా కమ్ముకుంది.

వాళ్లు వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు నడిచి మనుష్యుల చూపులకు దూరమవుతున్నారు.

వెంకట స్వామి వారు వెళ్లిన దిక్కు చూస్తూ సాష్టాంగ నమస్కారం చేసి శివస్తోత్రం చదవడం మొదలు పెట్టాడు.

చిరునవ్వు చెరగని జీవుడు, చితిపైన పంచ భూతాలలో కలిసి పోతున్నాడు.

